

ఉపాధి రోజు కూలి రూ.600 చెల్లించాలి

- సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: జాతీయ ఉపాధి హామీ పథకం కింద రోజువారీ కూలీ రూ. 600 చెల్లించాలని సిపిఎం మండల కార్యదర్శి కిందంగి రామారావు డిమాండ్ చేశారు.గురువారం మండలంలోని మాదగడ పంచాయతీ పరిధిలో గ్రామాల్లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేటాయించవలసిన నిధులు క్రమేపి తగ్గించడం వలన కూలీలకు సరిగా పనులు దొరకడం లేదన్నారు. ఉపాధి హామీ పథకం నిధులతో రోడ్లు,చెక్ డ్యాములు,సామాజిక భవనాలు, రచ్చబండ, గ్రంథాలయాలు వంటి పనులు చేపట్టడానికి ప్రణాళికలు రూపొందించి అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలన్నారు. ఉపాధి హామీ కూలీలకు సరైన గిట్టుబాటు కాకపోవడంతో అనేకమంది వలస బాట పడుతున్నారన్నారు. ప్రభుత్వం పనిముట్లు పరికరాలు గునపలు, తట్టలు, పారాలు ,టెంట్లు, మెడికల్ కిట్స్ నిలిపివేయడంతో ఎండ తీవ్రతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

మెగా డిఎస్‌సిలో గిరిజనులకు అన్యాయం

- ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలి
- జిఒ3కు ప్రత్యామ్నాయ ఆర్డినెన్స్ జారీ చేయాలని డిమాండ్
- ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన నిరసన ర్యాలీ, రాస్తారోకో



అరకులోయలో రాస్తారోకోలో ఆదివాసీ గిరిజన సంఘం నేతలు సురేంద్ర, బాలదేవ్, నిరుద్యోగ ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-అరకులోయ: షెడ్యూల్ ఏరియాలో గిరిజనుకుల 100 శాతం రిజర్వేషన్లు వర్తించేలా ఆర్డినెన్స్ జారీ చేసి, ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసి నియామకాలు చేపట్టాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిలో సురేంద్ర డిమాండ్ చేశారు. గురువారం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో అరకులోయ మండల కేంద్రంలోరాస్తారోకో నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర, జిల్లా ప్రధానకార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మెగా డిఎస్‌సిలో ఆదివాసులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. అరకులోయలో ఎన్నికల సభ, ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు జిఒ3కు చట్టబద్ధత కల్పిస్తామని ఇచ్చిన హామీ అమలు చేయకుండా, మెగా డిఎస్‌సిలో పోస్టులను కలిపేయడంతో ఆదివాసులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు.

పాడేరు ఐటిడిఎ పరిధిలో గిరిజన సంక్షేమ శాఖలో 400 పోస్టులు నోటిఫై చేశారని, వాటిల్లో కేవలం 24 పోస్టులు ఆదివాసులకు కేటాయించి, 1/70 చట్టం ప్రకారం ఆదివాసీ షెడ్యూల్ ప్రాతంలో శాశ్వత నివాసాలకు అనుమతి లేని గిరిజనేతరులకు 376 పోస్టులు కేటాయించడం ఆదివాసులకు తీరని అన్యాయం, ద్రోహం చేయడమేనన్నారు.

ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి గిరిజన ప్రాంతంలో 100 శాతం ఉపాధ్యాయ పోస్టులు గిరిజనులతో భర్తీ చేసేలా జిఒ3కు ప్రత్యామ్నాయంగా ప్రత్యేక ఆర్డినేన్స్ తీసుకొచ్చి, ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. లేకుంటే ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఏజెన్సీలో గిరిజన నిరుద్యోగులతో ఆందోళనచ చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు జి బుజ్జిబాబు, మండల నాయకులు కిల్లో జగన్నాధం, కిల్లో ముకుందు, పి.నానిబాబు, కె బుజ్జిబాబు జి. మల్లేష్, జి సుబ్బారావు, అప్పలస్వామి పాల్గొన్నారు

హుకుంపేట:మెగా డిఎస్‌సిలో ఆదివాసీలకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ గురువారం మండల కేంద్రంలో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం నుండి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మండల ప్రధాన కార్యదర్శి తాపుల కృష్ణారావు మాట్లాడుతూ, అల్లూరి జిల్లాలో 881 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ కానుండగా, పాడేరు ఐటిడిఎ పరిధిలో 24, రంపచోడవరం డివిజన్‌లో నాలుగు పోస్టులు మొత్తంగా కేవలం 30 పోస్టులు మాత్రమే గిరిజనులకు దక్కుతాయని, మిగిలిన 851 ఉద్యోగాలను గిరిజనేతరుల పరం కానున్నాయన్నారు. 1/70 చట్టం ప్రకారం ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో గిరిజనేతరులకు శాశ్వత గృహాలు నిర్మించడమే నేరమైనప్పుడు, ఇపుడు శాశ్వత ఉద్యోగాలు వారికి ఎలా కట్టిపెడతారని ప్రశ్నించారు. ఏజెన్సీలో వందశాతం ఉద్యోగాలను గిరిజనులతో భర్తీ చేసేలా జిఒ3కు ప్రత్యామ్నాయంగా ఆర్డినెన్స్‌ను తీసుకొచ్చి, మన్యంలోని ఉపాధ్యాయ పోస్టులన్నీ గిరిజనులతో భర్తీ చేసేలా ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ జారీ చేయాలన్నారు. .ఈనెలాఖరులోగా ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సిపై స్పష్టమైన ప్రకటన చేయకుంటే జిల్లా వ్యాప్త ఆందోళనలు చేస్తామన్నారు. ప్రత్యేక డిఎస్‌సి సాధనకు ఈనెల 26న పాడేరు కాఫీ హౌస్‌లో ఆదివాసి స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశానికి డిఎస్‌సి అభ్యర్థులు, నిరుద్యోగ గిరిజనులు, ప్రజలు హాజరై జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ మహిళాసంఘం నాయకురాలు ఎస్.హైమావతి, వైసిపి నేత జిసిహెచ్.సత్యం, ఉపాధ్యాయులు, ప్రభాకర్, బి.వి.రాజు, బొంజునాయుడు, రాంబాబు, రాజ్ కమల్ పాల్గొన్నారు.

పెదబయలు : షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి నోటిపికేషన్ విడుదల చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకుడు జపరంగి సునీల్ కుమార్ డిమాండ్ చేసారు. గురువారం పెదబయలులో సంఘం జిల్లా కమిటీ సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, జిల్లా మాజీ అధ్యక్షులు బొండా సన్నిబాబు, జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్న పడాల్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలోని ఉపాధ్యాయ పోస్టులన్నీ నిరుద్యోగ గిరిజన యువతకు దక్కాలంటే జిఒ3 చట్టబద్ధత కల్పస్తామని ఆదివాసులకు సిఎం చంద్రబాబు ఇచ్చిన హామీ అమలుచేయడంతోపాటు ప్రత్యేక ఆదివాసీ డిఎస్‌సి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఏజెన్సీలో ఆందోళన తప్పదని హెచ్చరించారు.కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు రాజు, బుజ్జిబాబు, ఎంఎం శ్రీను, రామారావు వెంకటరావు పాల్గొన్నారు.



హుకుంపేటలో నిరసన ప్రదర్శన



పెదబయలులో మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నేత సన్నిబాబు

షెడ్యూల్డ్ ప్రాంతంలో ఉపాధ్యాయ ఖాళీలను ప్రత్యేక డిఎస్‌సితో భర్తీ చేయాలి

గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం

పాడేరు: రాష్ట్ర ప్రభుత్వం మెగా డిఎస్‌సిలో నోటిఫై చేసిన షెడ్యూల్డ్ ఏరియాలోని పోస్టులను మినహాయించి, వాటిని ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సి ద్వారా భర్తీ చేయాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రేగం సూర్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సంఘం అల్లూరి జిల్లా గౌరవ అధ్యక్షులు కుర్తాడి రామారావు, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.నీలకంఠం మాసాడా శోభన్‌బాబులతో కలిసి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఐటిడిఎల పరిధిలోని ఆశ్రమ, ప్రభుత్వ పాఠశాలల్లోని అన్ని కేటగిరీల ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలను ప్రత్యేక డిఎస్‌సి ద్వారా భర్తీ చేసే ఆనవాయితీ ఉందని, అలాకాక జనరల్ డిఎస్‌సిలో ఏజెన్సీలోని పోస్టులను భర్తీ చేస్తే నిరుద్యోగ గిరిజన యువతకు తీరని నష్టం కలుగుతుందన్నారు.

జిఒ3కు ప్రత్యామ్నాయం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం హామీ ఇచ్చిన నేపథ్యంలో అది అమలయ్యాకే ఐదవ షెడ్యూల్‌లోని ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, అంతవరకు మెగా డిఎస్‌సి నుంచి ఆయా పోస్టులను మినహాయించి, ప్రత్యేక డిఎస్‌సి ద్వారా భర్తీకి వాయిదా వేయాలన్నారు.




జనం లేక నిర్మానుష్యంగా ఉన్న సీలేరు మార్కెట్ సెంటర్

భానుడి భగభగలు

- సీలేరులో 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

ప్రజాశక్తి-సీలేరు :ఏజెన్సీలో గురువారం భానుడు భగభగ మండిపోయాడు. జీకే వీధి మండలం సీలేరులో 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో నిప్పుల కొలిమిగా మారింది. జనసంచారం లేక రోడ్లు, ఏపీ జెన్కో కాలనీ పురవీధులు నిర్మానుష్యంగా మారాయి. ప్రజలు బయటికి రావడానికి బెంబేలెత్తిపోయారు. సూర్యుడు ఉదయం 6.30 గంటల నుంచే తన ప్రతాపాన్ని చూపాడు. క్రమంగా మధ్యాహ్నం 12 గంటల సమయానికి నిప్పులు కక్కడంతో ఉష్ణోగ్రత అధికమయ్యాయి. దీంతో ప్రజలు ఇళ్ల నుండి బయటకు రావడానికి సాహసించలేదు. సాయంత్రం 4 గంటలైనా ఉష్ణోగ్రతలో ఎటువంటి మార్పులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఉష్ణోగ్రత ప్రభావం ఎక్కువగా ఉండడంతో సీలేరు నది పరివాహక ప్రాంతంలో ఉన్న గిరిజనులు సైతం బెంబేలెత్తిపోయారు. సమీప అటవీ ప్రాంతానికి వెళ్లి చెట్లు కింద సేద తీరారు.



మాధవిని, ఆమె తల్లిదండ్రులను సత్కరిస్తున్న దృశ్యం

టెన్త్ విజేత మాధవికి ఘన సత్కారం

ప్రజాశక్తి-విఆర్.పురం : పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 590 మార్కులు సాధించి అల్లూరి జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన అరవ మాధవిని గురువారం విఆర్.పురం మండలం రేఖపల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు మామిడి రాజు, వెంకటలక్ష్మి దంపతులు ఘనంగా సత్కరించారు. మండలంలోని పొట్లవారిగూడెం గ్రామానికి చెందిన మాధవి కూనవరం పదో విద్యాభ్యాసం చేసిన కూనవరం మండలం టేకులబోరు విక్టోరియా మాంటిసోరీ విద్యాలయంలో విద్యార్థి మాధవితో పాటు ఆమె తల్లిదండ్రులు అరవ రాము ధనలక్ష్మిలను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అలాగే విక్టోరియా మాంటిసోరీ విద్యాలయం ప్రిన్సిపాల్ విక్కీ సింగ్, వైస్ ప్రిన్సిపల్ రుబ్బి మామిడి రాజు దంపతులు సత్కరించారు. ఈ సందర్భంగా మామిడి రాజు మాట్లాడుతూ విద్య పట్ల ఆసక్తి కనబరిస్తే ఎంతటి విజయాలైన అందుకోవచ్చని మాధవి నిరూపించిందన్నారు. విక్టోరియా మాంటిస్టోరీ విద్యాలయంలో ఇంటర్, డిగ్రీ కోర్సులను కూడా ప్రవేశ పెట్టాలని కోరారు. కార్యక్రమంలో మామిడి రాజు కుటుంబ సభ్యులు సుస్మిత, వంశీ గౌడ్, మామిడి చంద్రశేఖర్, మామిడి సరళ పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలన అందరి బాధ్యత

- జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్
- వివిధ శాఖల అధికారులతో సమీక్ష



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్‌పి తదితరులు

ప్రజాశక్తి-పాడేరు : గంజాయి వినియోగం సమాజానికి చేటని, దాన్ని నిర్మూలించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్‌కుమార్ స్పష్టం చేసారు. గురువారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో గంజాయి సాగు నిర్మూలనపై ఈగల్, పోలీస్, వ్యవసాయం, అటవీ, ఉద్యానవనం, వైద్య ఆరోగ్యం, విద్య, ఐసిడిఎస్, డ్వామా, డిఆర్‌డిఎ, ఇతర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గంజాయి నిర్మూలన, ప్రత్యామ్నాయ పంటలపై చర్చించారు

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గంజాయి నిర్మూలన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. డిగ్రీ, జూనియర్ కళాశాలలు, ఉన్నత పాఠశాలల్లో గంజాయి అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. కళాశాలల్లో నిర్వహించిన అవగాహనా సదస్సులు, డి ఎడిక్షన్ సెంటరుకు ఎంత మంది వచ్చారని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. గంజాయి సాగు చేసే రైతులు, సరఫరాదారులపై ప్రత్యేక దృష్టి పెట్టి, గుర్తించి కేసులు నమోదు చేయాలన్నారు. గంజాయి విడిచి పెట్టిన రైతులకు ప్రత్యామ్నాయ పంటలు, స్వయం ఉపాధి పథకాలు, బ్యాంకు రుణాలు, పశువులు, మేకలను మంజూరు చేయాలని స్పష్టం చేసారు. పాఠశాలల్లో ఫిర్యాదుల పెట్టెలలో ఎన్ని ఫిర్యాదులు వచ్చాయని ఆరా తీసారు. గంజాయి నిర్మాలనపై గ్రామస్థాయిలో బృందాలను ఏర్పాటు చేస్తామన్నారు. వారపు సంతల్లో గంజాయిపై అవగాహనా శిబిరాలు నిర్వహించాలని సూచించారు. 15 వేల ఎకరాలల్లో నీడతోటలు, పండ్ల తోటలు పెంపకానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. టెన్త్ ఫెయిలైన విద్యార్థులతో సప్లమెంటరీ పరీక్షలకు ఫీజులు కట్టించాలని సూచించారు.

గంజాయి కేసుల్లో ఆస్తుల జప్తు

జిల్లా ఎస్‌పి అమిత్ బర్దర్ మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా చేసినా వారి స్థిర, చరాస్తులను జప్తు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. గంజాయి స్మగ్లర్లకు గిరిజన గ్రామాల్లో ఆశ్రయం కల్పించడం నేరమన్నారు. జిల్లావ్యాప్తంగా 221 గ్రామాల్లో గంజాయి సాగు నిర్మూలనపై అవగాహనా సదస్సులు నిర్వహించామన్నారు. గతనెలలో 9 మందిపై కేసులు నమోదు చేసి 782 కేజీల గంజాయిని పట్టుకున్నామన్నారు. బస్‌స్టాండ్లలో పటిష్టమైన నిఘా పెట్టామని చెప్పారు. జాతీయ విద్యా విధానాన్ని సక్రమంగా అమలు చేయాలన్నారు. అనంతరం గంజాయి నిర్మూలనపై రూపొందించి వాల్‌పోస్టర్లను అధికారులు ఆవిష్కరించారు.

సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజె.అభిషేక్ గౌడ్, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బిఎస్. నంద్, జిల్లా ఉద్యానవన అధికారి రమేష్‌కుమార్ రావు, జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, గహనిర్మాణశాఖ ఇఇ బి.బాబు, డిఎస్ఒ వెంకటరావు, ఈగల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రమేష్, వివిద శాఖల జిల్లా అధికారులు, వర్చువల్‌గా రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ పాల్గొన్నారు.

పలుచోట్ల పంచాయతీరాజ్ దినోత్సవం



జన్‌మన్ గృహ మంజూరు పత్రాలు ఇస్తున్న దినకర్

ప్రజాశక్తి-అరకులోయ : ఆధునిక సమాజానికి దూరంగా మారుమూల గిరిజన తండాలలో నివసించే చిట్ట చివరి లబ్ధిదారుడి వరకు ప్రభుత్వ పథకాలు అందినప్పుడే నిజమైన అభివృద్ధి జరిగినట్టని 20 సూత్రాల ఆర్థిక ప్రణాళిక అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ అన్నారు. అనంతగిరి మండలం పైనంపాడు, అరకు వ్యాలీ మండలం కొత్త బల్లుగూడ పంచాయతీ సిమిలిగూడ గ్రామాలో జాతీయ పంచాయతీరాజ్ దివస్ గ్రామసభలలో పాల్గొన్నారు. ప్రధానమంత్రి జన్‌మన్ పథక లబ్ధిదారులతో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో కాకరపాడులో పర్యటించి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. సిమిలిగూడ గ్రామంలో పిఎం జన్‌మన్ మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందించారు గిరిజన విద్య గ్రామీణ అభివద్ధి సంస్థ(త్రెడ్స్) ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలను సామాన్యులకు చేరువ చేసే కార్యక్రమాన్ని పరిశీలించారు స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో అరకులోయ తహశీల్దార్ ఎంవివి ప్రసాద్, ఎంపిడిఒ లవ రాజు, అనంతగిరి ఎంపిడిఒ తేజ పైనంపాడు సర్పంచ్ సీదిరి చెల్లెమ్మ, ఎంపిటిసి వంతల తమన్న, వార్డు సభ్యులు కె గురుమూర్తి,మాజీ ఎంపీటీసీ సి హెచ్ బాబురావు, థ్రెడ్స్ సంస్థ ప్రతినిధి రాజు పాల్గొన్నారు.

పాడేరు : ప్రాధాన్యతా క్రమంలో గ్రామ పంచాయతీలకు మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేస్తామని జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్ కుమార్ అన్నారు. డి. గొందూరు గ్రామ పంచాయతీ ఆవరణలో గురువారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా గ్రామ సభలో మాట్లాడుతూ వికసిత పంచాయతీ పథకంలో ఎంపికైన 15 గ్రామాల్లో డి. గొందూరు పంచాయతీ ఉందన్నారు. పంచాయితీ అవసరాలను గుర్తించి గ్రామసభ లో తీర్మానం చేసి ప్రతిపాదనలు పంపిస్తే అవసరమైన మంజూరులు చేస్తామన్నారు. అనంతరం ప్రధాన మంత్రి జన్ మన్ పథకంలో 15 మంది లబ్దిదారులకు గహ మంజూరు పత్రాలను పంపిణీచేసారు. ఒక్కొక్క ఇంటికి ప్రభుత్వం రూ.2.39 లక్షల నిధులు విడుదల చేస్తోందన్నారు. లబ్దిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు చేయాలని సూచించారు.

జిల్లా పంచాయతీ అధికారి బి.లవరాజు మినుములూరులో గ్రామసభ నిర్వహించారు. సమావేశంలో గ్రామ వార్డు సచివాలయాల జిల్లా నోడల్ అధికారి పి. ఎస్.కుమార్, గహ నిర్మాణ శాఖ ఇ ఇ బి. బాబు, ఈ ఓ పి ఆర్ డి రమేష్, నీతి ఆయోగ్ బందం చైతన్య రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ సర్పంచ్ సీదరి రాంబాబు పాల్గొన్నారు.

హుకుంపేట: గ్రామ సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని ఐటిడిఎ ఇన్‌ఛార్జి పిఒ, జిల్లా జెసి డాక్టర్ ఎంజె అభిషేక్ గౌడ స్పష్టం చేశారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గడికించమండ సచివాలయంలో మాట్లాడుతూ పంచాయతీలోని అవసరాలను గుర్తించి గ్రామసభలో తీర్మానం చేయాలని, మహిళలకు ,బాలలకు పంచాయతీ చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. గిరిబాలలంతా పాఠశాలకు వెళుతున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. తాను ఇప్పటికే రెండు సార్లు గ్రామాన్ని పర్యటించి, తాగునీటిపథకం, డ్రైనేజీలు సిసి రోడ్లు మంజూరు చేశానన్నారు. సమావేశంలో సర్పంచ్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెసి అభిషేక్ గౌడ



హుకుంపేటలో గాంధీ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

అనంతగిరి : పిఎం జనమన్‌లో మంజూరైన ఇళ్లకు నిర్మాణాల మేరకు బిల్లులు చెల్లింపులు జరుగుతాయని మండల హౌసింగ్ ఎఇ నాగేశ్వరరావు అన్నారు జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని భీంపోలు, గరుగుబిల్లి గ్రామాల్లో సర్పంచుల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించారు. పిఎం జన్‌మన్ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు లబ్ధిదారులకు గృహ మంజురు పత్రాలు అందజేశారు.

డుంబ్రిగుడ: స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ప్రేమ్ సాగర్ ఆధ్వర్యాన నిర్వహించగా అరకు పంచాయతీలో సర్పంచ్ జి శారద, గసభ పంచాయతీలో సర్పంచ్ పి సునీత, ఖంద్రుమ్‌లో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కె హరి, కొర్రాయి పంచాయతీలో సర్పంచ్ పి కొములు ఆధ్వర్యాన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. గృహలబ్ధిధారులకు పిఎం జన్‌మన్ మంజూరు పత్రాలను అందజేశారు. పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.

హుకుంపేట : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయితీరాజ్ దినోత్సవం నిర్వహించారు. ఎంపిపి కూడ రాజుబాబు, వైస్ ఎంపిపి సూడిపల్లి కొండలరావు మాట్లాడుతూ పంచాయితీ రాజ్ వ్యవస్థ ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ఎఒ సన్యాసిరావు, సీనియర్ అసిస్టెంట్ ఉమా మహేశ్వరి, జూనియర్ అసిస్టెంట్ వెంకట రమణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ విజయ్, ములియా పుట్టు సర్పంచ్ సుబ్బారి చంటమ్మ, వ్యవసాయ సలహా మండలి జిల్లా మాజీ సభ్యులు ముత్యంగి విశ్వేశ్వర రావు, గండేరు చిన సత్యం ,తాపుల కృష్ణా రావు,భర్జ కృష్ణారావు, మండల పరిషత్ ఉద్యోగులు తరుణ్, బాకూరు రామరాజు, బడ్నైని నాగేశ్వరరావు, సత్యవతి, రాజు, రత్నం, వసంత కుమారి పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం పురస్కరించుకొని మాడగడ పంచాయతీ బోసుబెడలో గ్రామ సభ నిర్వహించారు. అనంతరం సిసి రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ పి జ్యోతి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి అప్పాలు, సోనాయి కృష్ణారావు, ఎం. బాలరాజు, బీబీ లక్ష్మి, వార్డు సభ్యులు వంతల డేవిడ్, కార్యదర్శి భోగిరాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రదీప్ చంద్ర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

దేవీపట్నం : దేవీపట్నం మండలం ఇందుకూరుపేట గ్రామపంచాయతీలో ఎంపిడిఒ డిఎన్.రత్నకుమారి అధ్యక్షతన గురువారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా మహాత్మా గాంధీ చిత్రపటానికి ఎంపిడిఒతో పాటు ఎంపీపీ కుంజము మురళి, స్థానిక సర్పంచ్ కారం కృష్ణబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇందుకూరుపేట పంచాయతీ కార్యదర్శి ఎం.సురేష్, వైస్ సర్పంచ్ కాలచర్ల రవి, వార్డు సభ్యులు, ఉపాధి హామీ కూలీలు, గ్రామ ప్రజలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో సర్పంచ్ పాంగి దుర్గో అధ్యక్షతన పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పరశురాం, వైద్యాధికారి కాదర్ మస్తాన్ వల్లి, ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి, ఉప సర్పంచ్ కె.వల్లి ప్రసాద్, పంచాయతీ గుమస్తా ప్రకాష్, డ్వాక్రా సంఘాల సభ్యులు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



దేవీపట్నంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ రత్నకుమారి

సెల్ సిగ్నల్స్ పనిచేయక ఇబ్బందులు

-ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోని బిఎస్‌ఎన్‌ఎల్ అధికారులు
-జియో సిగ్నల్ పరిస్థితి కూడా అంతే..

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరులో బిఎస్‌ఎన్ఎల్ నెట్వర్క్, సెల్ సిగ్నల్స్ 15 రోజులుగా పనిచేయకపోవడంతో వినియోగదారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. దూర ప్రాంతంలో ఉన్న తమ బంధువులు యోగక్షేమాలు కూడా తెలుసుకొనే అవకాశం లేక సతమతమవుతున్నారు. బిఎస్ఎన్ఎల్ సెల్ సిగ్నల్ పనిచేయటం లేదని వినియోగదారులు ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నెట్ బిల్లులు సెల్ ఫోను టాప్ ఆప్‌లకు డబ్బులు వృధా అవుతున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. మరో వైపు జియో నెట్వర్క్ సెల్ సిగ్నల్స్ కూడా సక్రమంగా పనిచేయడం లేదు. ఒక్కొక్క సమయంలో సెల్ సిగ్నల్ పోతూ వస్తూ ఉంటుంది. దీంతో వినియోగదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నెట్వర్క్ సేవలు, సెల్ సేవలు సక్రమంగా పని చేసేలా చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

సీలేరులో పని చేయని సెల్ టవర్ ఇదే...



వేసవి క్రీడా శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -పాడేరు: రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్)ఆదేశాలతో జిల్లాలో వచ్చేనెల ఒకటి నుంచి నెలాఖరు వరకు అన్ని క్రీడ విభాగాలలో వేసవి క్రీడ శిక్షణ శిబిరాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రాధికార సంస్థ అధికారి ఎ. జగన్మోహన రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎనిమిది నుండి 14 ఏళ్ళ వయసు గల బాల బాలికలకు వివిధ క్రీడాంశాలలో శిక్షణ తరగతులు నిర్వహిస్తామని, జిల్లాలోని ఆసక్తి కలిగిన క్రీడాకారులు, క్రీడా అసోసియేషన్స్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు ఈ నెల 25న సాయంత్రం 5గంటల లోపు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యాలయం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 9000274225 మరియు 6303193400 సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులతో వచ్చే ఏడాది ఢిల్లీలో నిర్వహించే గణతంత్ర వేడుకల్లో క్రీడాకారులు, క్రీడ ప్రోత్సాహకులు పద్మ అవార్డుల కోసం ఈనెల 26లోగా ఆసక్తి, అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శాప్ జిల్లా అధికారి జగన్మోహనరావు తెలిపారు. వెబ్‌సైట్‌లోని మార్గదర్శకాలకు అనుగుణంగా దరఖాస్తులు పూరించి మెయిల్ ద్వారా పంపాలని, పూర్తి వివరాలకు 9000274225, 6303193400 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ముమ్మరంగా దోమల నివారిణి పిచికారీ

ప్రజాశక్తి పాడేరు: మన్యంలో మలేరియా ఉధృతి నివారణలో భాగంగా దోమల నివారణకు ఎసిఎం ఐదుశాతం మందును గ్రామాల్లో ముమ్మరంగా పిచికారీ చేస్తున్నారు. పాడేరు మండలం మినుములూరు పిహెచ్‌సి పరిధిలోని కుమ్మరి పుట్టు కాలనీ, గ్రామాలు, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో దోమల నివారిణి పిచికారీ చేసినట్లు పాడేరు సబ్ యూనిట్ మలేరియా నిర్మూలనాధికారి బి. ధనుంజయ్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మొదటి విడతలో 89 గ్రామాలను ఎంపిక చేశామని, ఇప్పటివరకు 12 గ్రామాలలో 833 గృహాలలోని 1734 గదులలో దోమల నివారణ మందును పిచికారి చేశామన్నారు. గ్రామాల్లో పూర్తి స్థాయిలో ఎసిఎం పిశాతంమందును పిచికారీకి రెవెన్యూ, గ్రామ సచివాలయ శాఖ, వెలుగు, అంగన్వాడీ, మలేరియా శాఖ, వైద్య సిబ్బంది సమన్వయంతో చర్యలు చేపడుతున్నామని, దోమతెర వినియోగంపైన అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి గుల్లెలి సింహాద్రి, హెల్త్ అసిస్టెంట్ ఎస్ నాగరాజు, యం.టి.యస్ కె ప్రసాద్, మలేరియా సిబ్బంది కార్యకర్తలు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ : స్థానిక పిహెచ్‌సి తూటంగి సబ్ సెంటర్ గేదెలబంద గ్రామంలో స్థానిక వైద్యాధికారి పి రాంబాబు ఆధ్వర్యంలో దోమల నివారిణి మందు ఇంటింటా పిచికారీ చేశారు. గ్రామంలోని 80 ఇళ్లలో ఎసిఎం ఐదు శాతం మందు పిచికారీ చేసినట్లు తెలిపారుకార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ రామారావు, హెల్త్ అసిస్టెంట్ ఎస్ ప్రభాకర్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

మోదకొండమ్మ ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పాడేరు : మన్య ప్రజల ఆరాధ్య దేవత పాడేరు మోదకొండమ్మ జాతర వచ్చేనెల 11 నుంచి 13 వరకు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ, ఆలయ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే విశ్వేశ్వ రరాజు అన్నారు. గురువారం ఆలయంలో గ్రామ పెద్దలు కమిటీ సభ్యులతో కలిసి జాతర వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అమ్మవారి జాతర విజయవంతం చేసేందుకు ఉద్యోగ, వ్యాపార, అధికార, ప్రజా ప్రతినిధి వర్గాలన్నీ సహకారం అందించాలని కోరారు ఉత్సవ ఏర్పాట్లపై కమిటీ పెద్దలు సభ్యులు అందరూ సమీక్షి కృషి జరపాలని కోరారు కార్యక్రమంలో మాజీ మంత్రి మణికుమారి, మాజీ జడ్పీ చైర్పర్సన్ వంజంగి కాంతమ్మ, తెలుగు యువత నాయకుడు సుబ్బారావు, గ్రామ పెద్దలు ఆలయ ఉత్సవ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

గిరి రైతుల ఆర్గానిక్ ఉత్పత్తులకు గిరాకీ

ఐటిడిఎ ఇన్‌ఛార్జి పిఒ, జెసి డాక్టర్ ఎంజె అభిషేక్ గౌడ



వర్కుషాపులో మాట్లాడుతున్న ఐటిడిఎ ఇన్‌ఛార్జి పిఒ అభిషేక గౌడ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: గిరిజన రైతులు సాగు చేస్తున్న ఆర్గానిక్ ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉందనిఐటిడిఎ ఇన్‌చార్జి పిఒ, జెసి డాక్టర్ ఎంజె అభిషేక్ గౌడ అన్నారు. గురువారం ఐటిడిఎ వీడియో కాన్ఫరెన్స్ హాలులో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, పరిశ్రమల శాఖ అధికారులు, ఎంపిడిఒలతో గ్రామీణ పరిశ్రమల పార్కు ఏర్పాటుపై వ్యవసాయాధారిత ఒక రోజు వర్కుషాపు నిర్వహించారు. జిల్లాలో జి.మాడుగుల మండలం సోలభం పంచాయతీలో రూరల్ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు ఆలోచన చేస్తున్నామన్నారు. గిరిజన రైతుల ఆర్థికంగా ఎదగడానికి పరిశ్రమల పార్కులు దోహద పడతాయన్నారు. గిరిజన రైతులు పండిస్తున్న ఆర్గానిక్ కాఫీ, మిరియాలు, పసుపు, అల్లం వంటి పంటలకు డిమాండ్ ఉందన్నారు. బ్యాంకు రుణాలు, పెట్టుబడులు ప్రభుత్వ శాఖల సహకారం ఏ విధంగా తీసుకోవాలనే అంశాలపై చర్చించారు. ఎక్కడ పరిశ్రమల పార్కులు పెడితే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందో అధికారులను ఎఫ్ పిఒలను అడిగి తెలుసుకున్నారు. అనకాపల్లి, నర్సీపట్నం ప్రాంతాలలో శాటిలైట్ ఆగ్రో ఆర్గానికి ప్రాసెసింగ్ జోన్స్ ఏర్పాటు చేయడానికి జిల్లా కలెక్టర్ ఆలోచన చేస్తున్నారని, పరిశ్రమల పార్కులు ఏర్పాటుపైనా ప్రభుత్వం దృష్టికి తీసుకునివెళ్లారన్నారు. వర్కుషాపులో సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, జిల్లా పరిశ్రమ అధికారి జి.రవిశంకర్, పశు సంవర్ధకశాఖ ఉప సంచాలకులు నరసింహులు, ఎల్ డిఎం మాతునాయుడు, ఎపిఐఐసి అధికారులు, ఎంపిడిఒలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

భూముల రీసర్వే ప్రక్రియ పక్కాగా చేయండి

సర్వే ఉపసంచాలకులు కుమార్



వర్క్‌షాపులో మాట్లాడుతున్న డిడి కుమార్

ప్రజాశక్తి -పాడేరు : భూముల రీ సర్వే ప్రక్రియ పక్కాగా నిర్వహించాలని సర్వే ఉప సంచాలకులు డిఎల్ బిఎల్ కుమార్ ఆదేశించారు. గురువారం కలక్టరేట్ సమావేశ మందిరంలో ఆరు మండలాల తహసిల్దార్లు, గ్రామ రెవిన్యూ ఆఫీసర్లు, ఆర్ఎస్ డిటిలు, మండల సర్వేయర్లు, గ్రామ సర్వేయర్లతో వర్క్ షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 13వ నోటిఫికేషన్ సర్టిఫికేట్ జారీలోఅల్లూరి జిల్లా వెనకబడి ఉందన్నారు. జిల్లాలో రీ సర్వేకు 1012 గ్రామాలు ఉండగా, అందులో 504 గ్రామాలకు 13వ నోటిఫికేషన్ సర్టిఫికేట్ జారీ చేయగా 508 పెండింగ్ లో ఉన్నాయ్యన్నారు. చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ అండ్ డైరెక్టర్ ఆఫ్ సర్వే సెటిల్మెంట్ ఉత్తర్వుల మేరకు ఈ వర్క్‌షాపు నిర్వహిస్తునట్లుని తెలిపారు. ప్రతి గ్రామ సర్వేయర్, విఆర్ఒ లాగిన్ చేయడంలో సమస్యలు తెలుసుకొని పరిష్కారాలు తెలియజేశారు. గైర్హాజరైన విఆర్ఒలు, విఎస్‌లకు షోకాజ్ నోటీసు జారీచేయాలని ఆదేశించారు. 13వ నోటిఫికేషన్ సర్టిఫికేట్ జారీ చేసిన తర్వాత మళ్ళీ గ్రీవెన్స్‌కు సర్వే నంబరు వస్తే విఆర్ఒలు, విఎస్‌లదే బాధ్యతన్నారు. కార్యక్రమంలో హెడ్ క్వార్టర్ ఇన్‌స్పెక్టర్ ఎస్.నాగేశ్వరరావు, ఎడి సర్వే హెడ్క్వార్టర్ ఎం.రంగప్రసాడు, సీనియర్ ఇన్స్పెక్టర్ రాజమండ్రి వై. మోహనరావు, ఎడి సర్వే కే.దేవేంద్రుడు, డివిజనల్ ఇన్‌స్పెక్టర్ జి. వెంకటరావు పాల్గొన్నారు.

కళాశాల భవన నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: విద్యార్థులకు ఉపయోగపడేలా భవన నిర్మాణాలను చేపట్టాలని సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్ స్వామినాయుడు సూచించారు. మండల కేంద్రం డుంబ్రిగుడ కేజీబీవిలో నూతనంగా మంజూరైన కళాశాల భవన నిర్మాణానికి అనువైన స్థలాన్ని ఆ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌తో కలిసి పరిశీలించారు. నాణ్యతను పాటించి నిర్మాణాలు జరిగేలా చూసుకోవాలన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర మండలి స్టాక్ పాయింట్ సందర్శించి, ఇటీవల వచ్చిన నోట్ బుక్స్ పరిశీలించారు. నోట్ బుక్స్ పాడవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పాఠశాలలకు సకాలంలో చేరేలా చర్యలు తీసుకోవాలని. సిబ్బందికి సూచించారు. కెజిబివి ప్రత్యేక అధికారిణి భవాని, ఎంఆర్‌సి సిబ్బంది నారాయణ, నాగేంద్ర పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ఎస్ఎస్ఎ పీడీ స్వామినాయుడు

నేరాలు ఘోరాలు

పిడుగుపాటుకు ఐదు ఆవులు మృతి

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని పట్టం పంచాయతీ డాబవలసలో బుధవారం పిడుగుపాటుకు ఐదు ఆవులు మృతి చెందాయి. ఊరి పక్కన కొండపైన ఆవులు మేతకు తీసుకెళ్లిన సమయంలో వర్షంతోపాటు పిడుగులు పడడంతో గ్రామానికి చెందిన కొన్నోడి. లచ్చన్నకు చెందిన మూడు ఆవులు, కొన్నోడి. సింహాద్రికి చెంది రెండు ఆవులు పిడుగు పడి మరణించాయి.ఒకే కుటుంబానికి చెందిన ఐదు ఆవులు ఒకసారిగా మృతిచెందడంతో బాధిత గిరిజనులు కన్నీరు మునీరుగా విలపిస్తున్నారు. రూ.4లక్షల నష్టం కలిగిందని, ప్రభుత్వం స్పందించి పరిహారం అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.



పిడుగుపడి మృతి చెందిన ఆవులు

నేల బావిలో పడి గొర్రెల కాపరి మృతి

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని నారపాడు గ్రామానికి చెందిన గొర్రెల కాపరి నేలబావిలో పడి మృతి చెందినట్లు స్థానిక సీఐ పిన్నింటి రమణ తెలిపారు. సిఐ తెలిపిన వివరాలు ప్రకారం.... నారపాడు గ్రామానికి చెందిన నంబారు సన అప్పారావు (59) ఈనెల 22న గొర్రెల మందను మేతకు తోలుకెళ్లాడు. సాయంత్రం గొర్రెలు ఇంటికి వచ్చాయిగాని అప్పారావు రాలేదు. దీంతో కుటుంబీకులు గ్రామ పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. 23న గ్రామంలోని పొలాల్లోనూ, బావుల్లోనూ వెతగ్గా ఓ నేలబావిలో అప్పారావు మృతదేహాన్ని కుటుంబీకులు గుర్తించారు. ఈ మేరకు అప్పారావు కుమారుడు నంబారు లోవరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టల నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కె.కోటపాడు : విద్యుత్ షాక్‌తో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని చౌడువాడ శివారు మల్లంపాలెం గ్రామంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం... గ్రామానికి చెందిన వంటాకు వెంకటరమణ(49) సాయంత్రం తమ పొలంలో ఉన్న విద్యుత్ మోటార్ తిరగకపోవడంతో దగ్గర్లో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ వద్దకు వెళ్లి అక్కడ ఉన్న ఫీజు బాక్స్‌ను పట్టుకొని ఫీజు వేస్తుండగా విద్యుత్ షాకు గురై పడిపోయాడు. అది గమనించిన స్థానికులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని భార్య సత్యవతి కె.కోటపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండలం జమ్మాదులపాలెం గ్రామ శివారు కరకవారి పాకల వద్దన నాటుసారా విక్రయిస్తున్న కరకరాజు అనే వ్యక్తిని గురువారం అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. కరకరాజు నుండి 3 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని, ఆయనపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ సిబ్బంది ఎంవిఎస్.రమేష్ తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని చినదొడ్డిగల్లు ప్రాంతంలో మామిడి తోటలో గురువారం పేకాట శిబిరంపై దాడి చేస్తున్నట్లు ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. ఈ దాడుల్లో ఏడు గురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసి, వారి వద్ద నుండి రూ.35,230 నగదును స్వాధీన పరుచుకున్నట్లు తెలిపారు.

చెట్టు పై నుంచి పడి గీత కార్మికుడు మృతి

ప్రజాశక్తి -నక్కపల్లి : ప్రమాదవశాత్తు చెట్టు పైనుండి జారిపడి నక్కపల్లి గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు దమ్ము అప్పలకొండ (41) మృతి చెందాడు. బుధవారం తాటిచెట్టు ఎక్కి కమ్మలు కొడుతుండగా జారిపడడంతో అప్పలకొండ తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే తుని ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కాకినాడ ఆసుపత్రికి రిఫర్ చేయగా, అక్కడ చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో బుధవారం రాత్రి మృత్యువాత పడ్డాడు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సి వెంకట్రావు తెలిపారు.



అభివృద్ధి పనుల ప్రారంభంలో ఎమ్మెల్యే శిరీషా దేవి

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని పలు అభివృద్ధి పనులకు రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి శంకుస్థాపనలు చేశారు. మండలంలోని రేపటిపాలెం, ఉర్లాకులుపాడు జి.శరభవరం, మారేడుబాక, బలిజపాడు, మద్దిబందల, పెద్దరేలంగిపాడు గ్రామాలలో జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా మంజూరైన వాటర్ ట్యాంకుల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని రేవటిపాలెం, మడేరు ఆనకట్ట పనులు, దోనెలపాలెం, ఉర్లాకులపాడు ఇరిగేషన్ పనులకు భూమి పూజలు చేశారు. మండలంలోని ఉర్లాకులపాడు గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏజెన్సీలో విద్య, వైద్యం, తాగునీరు, విద్యుత్, రహదారులు వంటి మౌలిక వసతుల కల్పనకు కోట్లాది రూపాయలు ప్రభుత్వం వెచ్చిస్తుందని చెప్పారు. అనంతరం ఇటీవల నూతనంగా మంజూరైన 32 మంది హౌసింగ్ లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. గతంలో గిరిజనుల గృహ నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.30 లక్షలు కేటాయించగా, నిర్మాణ సామాగ్రి ధరల పెరిగిన నేపథ్యంలో ముఖ్యమంత్రి గిరిజనుల గృహ నిర్మాణానికి మరో లక్ష రూపాయలు అదనంగా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ లోతా లక్ష్మణరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తహశీల్దార్ ఎ.సత్యనారాయణ, ఎంపీడీవో ఎల్.యాదగిరీశ్వరరావు, సీఐ ఎన్.సన్యాసినాయుడు, జడ్డంగి ఎస్ఐ చినబాబు, టిడిపి సీనియర్ నేత డి.శివరామచంద్రరాజు, మండల అధ్యక్ష కార్యదర్శులు గొల్లపూడి పెద్దిరాజు, ఎం డింబకేశ్వరరావు, సొసైటీ మాజీ అధ్యక్షులు గణజాల తాతారావ్, మాజీ జెడ్పిటిసి కె.బుజ్జి చిన్నాలమ్మ పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు, కోచ్‌లకు సన్మానం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: విశాఖ జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం ఆధ్వర్యంలో వరల్డ్ టేబుల్ టెన్నిస్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విశాఖ జిల్లా నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులను, వారి తల్లిదండ్రులను, కోచ్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎల్ఐసి సీనియర్ డివిజన్ మేనేజర్ శారద ప్రసాద్‌దాస్ హాజరయ్యారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే స్పోర్ట్స్ జనరల్ సెక్రెటరీ అవార్డు గ్రహీత ఉష ప్రత్యేక అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ క్రీడాకారులు వి.సంయుక్త, పి.మహిధర్‌వర్మ, పివి.మణికుమార్‌లతో పాటు జాతీయ క్రీడాకారులు ఎం.ప్రజ్ఞాన్, టి.సాయిచరణ్, ఎస్‌కె.అరిఫాసుల్తానా, సిహెచ్ఎంఎన్.బాలాజీ, టి.శాన్విక , శుభంకర్, ఎస్కే రబ్బాని, ఎం.సాయికౌశిక్, రేణుక సత్య, సి. హెచ్.వి అభిరామ్, టి.శ్రీసాహితీరాజ్, ఎం.మోహిత గాయత్రి, వి.హార్దిక్ రామ్, మోహితలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ సంఘం ఉపాధ్యక్షులు డివిఎస్‌వై.శర్మ, విశాఖ మాస్టర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాయికృష్ణమూర్తి, కెవిఎస్ఎన్.రాజు, ఒలంపియన్ ఎంవి.మాణిక్యం, విశాఖ జిల్లా మాజీ కార్యదర్శి పివిఎన్.సూర్యారావు, ఎల్ఐసి ఉద్యోగుల సంఘం కార్యదర్శి జి.వరప్రసాద్ పాల్గొన్నారు.

చంద్రమౌళికి విసిసి నివాళి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో మరణించిన విశాఖ వాసి, రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ చంద్రమౌళికి వైజాగ్ చిల్డ్రన్స్‌క్లబ్, ఆసరా చారిటబుల్ సొసైటీ నివాళులు అర్పించాయి. విసిసి వ్యవస్థాపకురాలు డాక్టర్ కె.రమాప్రభ మాట్లాడుతూ చంద్రమౌళి స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియాలో పనిచేస్తున్నప్పటి నుంచి ఆసరా చారిటబుల్ సొసైటీలో సభ్యులుగా ఉంటూ ఉదారంగా ఆర్థిక సహాయం అందించేవారని తెలిపారు.

పర్యావరణాన్ని ధ్వంసం చేసి ఉర్సాకు వత్తాసా ?

డొల్ల కంపెనీకి 60 ఎకరాలు కేటాయింపా ?
సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం
విశాఖలో కేటాయించిన భూములను పరిశీలించిన పార్టీ బృందం



ఉర్సా భూముల్లో పర్యటిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

అత్యంత విలువైన, పర్యావరణ రక్షణకు కవచాల్లా ఉండే విశాఖలోని ఐటి హిల్స్, కాపులుప్పాడ కొండలపై 'డొల్ల' కంపెనీ ఉర్సాకు సుమారు 60 ఎకరాల భూములను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించడం దారుణమని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం అన్నారు. ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన ప్రభుత్వమే పర్యావరణాన్ని విధ్వంసం చేయడం తగని పని అని తెలిపారు. గురువారం విశాఖలోని ఐటి హిల్ నెంబర్ 3లో టిసిఎస్‌కు కేటాయిచిన 21 ఎకరాలను, ఆ పక్కనే 'ఉర్సా' కంపెనీకి కేటాయించిన మూడున్నర ఎకరాలను పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి పరిశీలించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఉర్సా కంపెనీకి విశాఖలో ఐటి హిల్ - 3లో 3.5 ఎకరాలు, కాపులుప్పాడలో మరో 56.36 ఎకరాల భూమిని కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారని, వీటి విలువ సుమారు రూ 3 వేల కోట్లు అని తెలిపారు. ఈ కంపెనీ సుమారు రూ.5278 కోట్లు పెట్టుబడితో డేటా సెంటరు నెలకొల్పుతుందని, దీని ద్వారా 2500 మందికి ఉద్యోగాలు వస్తాయని ప్రకటించిందని, ఆ విషయాలు నమ్మశక్యంగా లేవని అన్నారు. ఐటి రంగంలో కనీస అనుభవం లేని, రెండు నెలల క్రితం రిజిస్ట్రేషన్ చేసుకున్న 'ఉర్సా' డేటా సెంటర్‌కు ఎలా చంద్రబాబు ప్రభుత్వం భూములిచ్చేస్తుందని, తక్షణమే కేటాయింపులు రద్దు చెయ్యాలని డిమాండ్ చేశారు.

ఇది పూర్తిగా రాజకీయ అవినీతి, ఆశ్రితపక్షపాతం

డేటా సెంటర్ ప్రాజెక్టు ముసుగులో రాష్ట్రంలోని టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం ఉర్సా క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే డొల్ల సంస్థకు ఏకంగా 60 ఎకరాల విలువైన భూమిని ఎకరా 0.99 పైసల చొప్పున ఇవ్వడం అంటే ఇది పూర్తిగా రాజకీయ అవినీతని, తన అనుయాయులకు కట్టబెట్టే ఆశ్రితపక్షపాతమని లోకనాథం విమర్శించారు. అభివృద్ధి పేరిట కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున విలువైన భూములను బడా సంస్థలకు ధారాదత్తం చేస్తోందన్నారు. రూ.70 వేల కోట్లతో డేటా సెంటర్ నెలకొల్పుతారనే పేరిట 2019లో చంద్రబాబు మధురవాడలో సుమారు 134 ఎకరాలను అదానీకి కేటాయించారని, దానికి ఇప్పటికీ అతీగతీ లేదని విమర్శించారు. ఇటీవల భీమిలి దగ్గర రిసార్ట్స్, హోటల్ పేర వందల ఎకరాలను కేటాయింపులు చేశారని, విశాఖ నగర నడిబొడ్డులో ఉన్న రెండు వేల కోట్ల విలువ కలిగిన 13.50 ఎకరాల భూమిని అప్పనంగా లులూ మాల్‌కు కట్టబెట్టారని అన్నారు. ఇలా అభివద్ధి, ఉద్యోగాల ముసుగులో పెద్దఎత్తున భూదోపిడీ, భారీ అవినీతి చోటు చేసుకున్నాయని తెలిపారు.

పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ రాష్ట్ర విభజన తరువాత విశాఖలో వివిధ ప్రైవేట్ సంస్థలకు జరిగిన భూ కేటాయింపులు, ప్రస్తుత పరిస్థితి, అలాగే ఇప్పటి వరకు ఐటి సంస్థలకు కేటాయించిన భూములు, స్థాపించిన సంస్థలు, వచ్చిన ఉద్యోగాలు, వారి వేతనాలు, ఎంఒయులు, ఉల్లంఘనలు, ఖాళీగా ఉన్న భూములు, తీసుకున్న చర్యలు తదితర వివరాలతో రాష్ట్ర ప్రభుత్వం భూకేటాయింపుల శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉర్సా పూర్తిగా డొల్ల కంపెనీ అని, కూటమి ప్రభుత్వంలో ఉన్న బడా నాయకునికి చెందిన బినామీ అని కూడా ప్రచారం జరుగుతోందని, ఇప్పటికే మీడియా ఈ సంస్థ యాజమాన్యం, దాని మూలాలు, అక్రమ రాజకీయ బంధాలను బట్టబయలు చేసిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోటే ఆఘమేఘాల మీద అమెరికాలో గత ఏడాది సెప్టెంబర్ 27న, ఆ తరువాత ఈ ఏడాది ఫిబ్రవరి 12న హైదరాబాద్‌లో కంపెనీని రిజిస్టర్ చేశారని, పై పెచ్చు ఆ కంపెనీ కేవలం అధీకృత పెట్టుబడిగా రూ.10 లక్షలు మాత్రమే చూపిందని అన్నారు. దీంతోనే ప్రభుత్వంలోని కొందరి బినామీ సంస్థని స్పష్టంగా తేలిపోయిందని తెలిపారు. ఈ సంస్థ రూ.5278 కోట్లు పెట్టుబడి పెడుతుందని చెప్పడం వెనుక ఖరీదైన భూములను అప్పనంగా కొట్టేయడానికేనన్న విషయం దాగి ఉందన్నారు. ఇప్పటికే ఆ సంస్థ వెనుక విజయవాడ టిడిపి ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఉన్నాడని, అతని బినామీ అయిన అబ్బూరి సతీష్ ఈ డొల్ల కంపెనీలో డైరెక్టర్ అని, గతంలో ఆయన చేసిన మోసాలపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని అన్నారు. వీటిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

పఠన సంస్కృతిని పెంపొందించేందుకు కృషి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : పఠన సంస్కృతిని పెంపొందించడానికి సమగ్రమైన ప్రయత్నంలో భాగంగా మేక్ ఇండియా రీడ్ మోర్ మిషన్‌ను అమోజాన్ ఇండియా ఆధ్వర్యంలో ముందుకు తీసుకువెళతున్నట్లు అమోజాన్ ఇండియా బుక్స్, టాయ్స్ విభాగ డైరెక్టర్ రాజశ్రీ గుయిన్ తెలిపారు. ప్రపంచ పుస్తక దినం సందర్భంగా నగరంలోని ఒక హోటల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మిషన్‌కు మద్దతుగా, నేషనల్ బుక్‌ట్రస్ట్, ఎన్సిఈఆర్‌టితో భాగస్వామ్యంలో దేశవ్యాప్తంగా పుస్తకాల విరాళం డ్రైవ్‌ను ప్రారంభించినట్టు తెలిపారు. రాగల 12 వారాల్లో వేలాది పుస్తకాలు అంగన్వాడీ కేంద్రాలకు, ప్రభుత్వ పాఠశాలలకు, అట్టడుగు సంస్థలకు పంపిణీ చేస్తామన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న పాఠకులకు పుస్తక లభ్యతను విస్తరించడంలో అమోజాన్ నిరంతర కషి, నిబద్ధత ఆధారపడిందన్నారు. ప్రతి ఇంట ముంగిటకు సరైన పుస్తకాన్ని తీసుకురావడమే తమ లక్ష్యం అన్నారు.

ఎస్ఐ భాస్కర్‌కు సత్కారం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: పి.ఎం.పాలెం పోలీసుస్టేషన్ పరిధిలో ఈ నెల 2వ తేదీన ఓ ప్రేమోన్మాది చేతిలో తీవ్రంగా గాయపడిన అమ్మాయిని చాకచక్యంగా ఆసుపత్రికి తరలించి, సకాలంలో చికిత్స అందజేసి బాధితురాలిని కాపాడిన ఎస్ఐ కె.భాస్కరరావను నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో గురువారం ప్రత్యేకంగా సత్కరించి, రివార్డ్ మంజూరు ఆర్డరును నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అందజేశారు. పి.ఎంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన సంఘటనలో 112 ద్వారా సమాచారం అందుకున్న ఎస్ఐ. కె.భాస్కరరావు, హెచ్.సి. విజయ్‌కుమార్ తక్షణం సంఘటన జరిగిన ప్రదేశానికి చేరుకుని పరిస్థితిని గమనించి అంబులెన్స్ రావడానికి ఆలస్యం అవుతుందని గ్రహించి వారి సొంత ద్విచక్ర వాహనంపై బాధితురాలిని సకాలంలో ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేసి రక్షించిన విషయం తెలిసిందే. ఈ సంఘటనలో ఉత్తమ విధులు నిర్వహించిన ఇద్దరికి సిపి ప్రత్యేకంగా సత్కరించి, రివార్డ్ ఆర్డర్ అందజేశారు.



సాయం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

అగ్ని ప్రమాద బాధితునికి యుటిఎఫ్ సహాయం

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని చొక్కనపల్లి గ్రామంలో ఈనెల 20న జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయి, సర్వం కోల్పోయిన తోడం రాంబాబు, నాగమణి కుటుంబానికి ఎపి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ఆర్థిక సహాయం అందజేసింది. ఈ మేరకు శ్రీరామగిరి పంచాయతీ సర్పంచ్ పులి సంతోష్ కుమార్, యుటిఎఫ్ సీనియర్ నాయకులు సున్నం రాజులు, మండల కమిటీ సభ్యులు పూసం రామారావు చేతుల మీదుగా బాధిత కుటుంబానికి బియ్యం, నిత్యావసర సరుకులు, గిన్నెలు, రూ.2 వేల నగదు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి యన్.జగదీష్, కార్యదర్శులు యన్. రామకృష్ణ, యం.బాబు, పూసం రామారావు, జె వెంకటరెడ్డి, ఎంపీటీసీ పూనెం ప్రదీప్ కుమార్, సిపిఎం నాయకులు తోడం రాజు, దారయ్య, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పశువుల కొమ్ములకు రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని జాతీయ రహదారిలో పశువుల వలన తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో రైతులు తమ పశువులకు రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేసుకోవాలని పశు వైద్యాధికారి తరుణ్ సూచించారు. మండలంలోని తంటికొండ గ్రామపంచాయతీ పరిధిలోని జాతీయ రహదారి పక్కనున్న గ్రామాల్లో రైతులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రిపూట సంచరించే పశువుల వల్ల రాత్రి సమయాలలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్న కారణంగా రాత్రిపూట సంచరించే పశువుల కొమ్ములకు రేడియం స్టిక్కర్లుగాని, వెయిట్ పెయింట్‌గాని వేయాలని ఆదేశించారు. రైతులు విచ్చలవిడిగా రహదారులపై పశువులను వదిలేయకుండా తమ ఇళ్ల వద్ద కట్టి పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ బాలు, సచివాలయ సిబ్బంది, పశుసంవర్ధక శాఖ సహాయకులు కిషోర్, ఆశా, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించకపోవడం అన్యాయం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : పంచాయతీ పరిధిలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రోటోకాల్ పాటించకపోవడం అన్యాయమని మండలంలోని వాతంగి పంచాయతీ సర్పంచ్ బి.సుబ్బలక్ష్మి, వైస్ ఎంపీపీ రాజేశ్వరి జానుబాబు పేర్కొన్నారు. వాతంగి పంచాయతీ పరిధి పెదరెల్లంగిపాడు గ్రామంలో జల్ జీవన్ మిషన్ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం గురువారం సాయంత్రం 4 గంటలకు ఉందని తొలిత ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి తమకు తెలిపారని పేర్కొన్నారు. అయితే తాము వారు చెప్పిన సమయానికి వెళ్లేసరికే భూమి పూజ పూర్తి చేసుకొని వెళ్ళిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన ప్రజా ప్రజాప్రతినిధులమైన తమను పిలిచి అవమానించడం సరికాదని, తమను కించపరిచే విధంగా ఉందని వాపోయారు.

26న జివిఎంసి డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ: జివిఎంసి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌పై ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానానికి సంబంధించి ఈ నెల 26న శనివారం ఉదయం 11 గంటలకు జివిఎంసి ప్రధాన కార్యాలయం కౌన్సిల్ సమావేశం మందిరంలో కార్పొరేషన్ సమావేశాన్ని నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్, జివిఎంసి ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎన్.హరేందిర ప్రసాద్ గురువారం పత్రికా ప్రకటనలో తెలిపారు. అవిశ్వాస తీర్మానంపై నిర్వహించే కౌన్సిల్ సమావేశానికి హాజరవుతున్న ఎక్స్‌అఫిషియో మెంబర్లు, వార్డు మెంబర్లు కౌన్సిల్ హాల్ ప్రాంగణంలోకి ప్రవేశించిన పిదప వారి మొబైల్స్‌ను ఫ్లైట్‌మోడ్‌లో పెట్టుకోవాలని సూచించారు. ఐడెంటీ కార్డు ఉన్నవారికి మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు.